క్లుప్తంగా

5 నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులను ప్రారంభిస్తున్నట్లు ఈ కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి, ఆపైన చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు రాఘవయ్య పార్కు సమీపంలోని కార్యాలయంలో ఫిబ్రవరి నాలుగో తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

పటమట(విజయవాడతూర్పు): కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జాతీయ నాయకులను మినహాయించి, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలు, బానర్లను తక్షణమే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు.

రాజశ్యామల అలంకారంలో కాళీమాత దర్శనం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో మాఘ మాసాన్ని పురస్కరించుకుని రాజశ్యామల నవరాత్రులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాళీమాత అమ్మవారు రాజశ్యామల అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మొదటిరోజు అమ్మవారికి అభిషేకం, గణపతి పూజ, మండపారాధన, నవగ్రహాల హోమం, లక్ష్మీ గణపతి హోమం, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి హోమం, వీరాంజనేయస్వామి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవసరం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుషులు, మహిళలే కాకుండా యువతులు సైతం హెచ్‌పీవీ నివారణకు వ్యాక్సిన్ తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కోడె ప్రభావతి సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులకు హెచ్‌పీవీ వైరస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎస్.వి.రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ ప్రభావతి ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కలిగించారు. హెచ్‌పీవీ వల్ల ఏర్పడుతున్న సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, వీనం క్యాన్సర్ వంటి ఆరు రకాల క్యాన్సర్లకు కారణమవుతున్న వైరస్‌ను తొలి దశలోనే అరికట్టాలన్నారు. తొమ్మిది నుంచి 14 ఏళ్ల వారు రెండు డోసులు, 15 నుంచి 26 ఏళ్ల వయస్సు ఉన్న వారు మూడు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లలితానగర్ ఫీడర్ కింద విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు జోజినగర్, లలితానగర్, పోలీస్ కాలనీ, నూర్ మసీదు రోడ్, భవానీపురం రైతుబజార్ రోడ్, టెలిఫోన్ కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దర్శనాల దళారీపై ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దర్శనాలు చేయిస్తానని భక్తుల దగ్గర డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న దళారీపై గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన కారుబిల్లి శ్రీనివాసరావు (58) కనకదుర్గానగర్‌లో కొబ్బరికాయలు విక్రయిస్తున్నాడు. రద్దీ రోజుల్లో అమ్మవారి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దర్శనం చేయిస్తానంటూ శ్రీనివాసరావు వారి నుంచి డబ్బుల వసూలు చేస్తున్నాడు. ఆలయ సిబ్బందితో సంబంధాలు పెట్టుకొని కొన్ని టిక్కెట్లు తీసుకొని వారికి దర్శనాలు చేయించటం చేస్తుంటాడు. దీనిని గుర్తించిన ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లతో ఇక్కట్లు

- రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఎక్కడ చూసినా ఇసుకే
- రవాణా సమయంలో ట్రక్‌ల నుంచి కారుతున్న వైనం
- ఇసుక కారణంగా అదుపు తప్పుతున్న వాహనాలు



బైపాస్ రోడ్డులో ఇసుక విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు



భవానీపురం బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్క రోడ్డుపై పడిన ఇసుక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇసుక రవాణా ట్రాక్టర్లతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ట్రాక్టర్లతో రవాణా చేసే సమయంలో ట్రక్‌ల నుంచి రోడ్డు పొడువునా ఇసుక కారుతోంది. రోడ్లపై, మార్జిన్లు, ఫుట్‌పాత్‌లపై ఇసుక కుప్పలుగా పడుతోంది. ఆ ఇసుకను తొలగించకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కారణంగా బైక్‌లు అదుపుతప్పి కిందపడి వాహనచోదకులు గాయాలబారిన పడుతున్నారు. ఇసుక ట్రాక్టర్లను నగరంలోని ప్రధాన రహదారులపైకి రానీయకుండా పోలీసులు కొన్నాళ్లు అడ్డుకున్నారు. ఆ తర్వాత అంతా షరా మామూలే. నిత్యం ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతున్నాయి.

యథేచ్ఛగా ఇసుక విక్రయాలు

ఇళ్ల నిర్మాణం, మరమ్మతులకు అవసరమైన ఇసుకను వినియోగదారులకు అందించేందుకు ప్రధాన రోడ్లపై పలు చోట్ల భవన నిర్మాణ మెటీరియల్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. వీటికి నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా అవుతోంది. ఇసుక ట్రాక్టర్లను నగరంలోనికి అనుమతించలేదు. కానీ కొందరు రాజకీయ పలుకుబడితో వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను విక్రయ కేంద్రాలకు తరలిస్తున్నారు. తరలించే సమయంలో ఏ ఒక్కరూ నిబంధనలు పాటించడం లేదు. నగరం మధ్యలో ఎక్కడో ఒకటి రెండు భవనాలకు ఇసుక సరఫరా చేయాలంటే జన సంచారం లేని సమయంలో అర్ధరాత్రి వేళల్లో అనుమతిస్తారు. కానీ వ్యాపారులు రాత్రింబవళ్లు నిబంధనలను పట్టించుకోకుండా ప్రధాన రహదారి గుండా ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తున్నారు. ట్రక్ నుంచి ఇసుక పడిపోకుండా, గాలికి ఎగుర కుండా పట్టాలు కట్టాల్సి ఉంటుంది. కొందరు ఆ పనిచేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. కొందరు పట్టాలు కట్టినా ట్రక్ అడుగు భాగం నుంచి ఇసుక కారిపోయి రోడ్లపై కుప్పలుగా పడుతోంది. కొందరు అసలు పట్టాలేమీ కట్టకుండానే నగరంలో యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. మలుపులో ట్రక్ వేగంగా తిప్పడంతో ఒరిగిపోయి దిబ్బలు దిబ్బలుగా పడుతోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొందరు రోడ్డు మార్జిన్లలో ట్రాక్టర్లు నిలిపి బేరం రాగానే విక్రయిస్తున్నారు. అప్పటి వరకు రోడ్డుపక్కన ఫుట్‌పాత్‌లపై నిలిపివేస్తున్నారు.

జారిపోతున్న బైక్‌లు

రోడ్లపై ఇసుక పడడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. బైక్‌లు స్కిడ్ అయి పడిపోతున్నారు. గాయాల పాలవుతున్నారు. ప్రస్తుతం రోజూ ఉదయం మంచు కురుస్తోంది. ఈ మంచుకు రోడ్డు సరిగా కనిపించకపోవడం, రోడ్డుపై ఇసుక ఉండడంతో బైక్‌లు జారిపోతున్న ఘటనలు ఎక్కువయ్యాయి. గొల్లపూడి, భవానీపురం సరిహద్దులో ఉదయాన్నే ట్రాక్టర్లు వస్తున్నాయి. ఆ సమయంలో పిల్లలను బడులకు పంపించేందుకు మహిళలు, పెద్దవాళ్లు బైక్‌లపై వస్తున్నాయి. ఇసుకను గమనించకపోవడం మలుపులు తిరుగుతున్న సమయంలో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డులో మహిళ బైక్ జారిపోయి దెబ్బలు తగిలాయి. రోడ్డు పొడవునా ఇసుక పడిపోయి ప్రమాదకరంగా ఉంది. బైపాస్ రోడ్డులో ఇసుక ట్రాక్టర్లకు నియంత్రణ లేకుండా పోయింది. డస్ట్ ఫ్రీ రోడ్ల కోసం ఏర్పాటు చేసిన పేవర్ బ్లాక్స్‌పై ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లు నిలుపుతున్నారని, అవి దెబ్బతిని నడవడానికి వీల్లేకుండా పోతోంది స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం ట్రాక్టర్లు నగరంలోకి రాకుండా గొల్లపూడి అట్కిన్‌సన్ రోడ్డు వద్ద అడ్డుకున్నారు. కొద్ది రోజులు ఇబ్బంది లేకుండా పోయింది. ప్రస్తుతం పరిస్థితి యథాతథంగా ఉంది. ట్రాక్టర్లను ప్రధాన రహదారిపైకి రాకుండా నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. పోలీసులు, మైనింగ్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొప్ప శాంతిదూత మహాత్మాగాంధీ



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలోనే గొప్ప శాంతి దూత మహాత్మాగాంధీ అనివలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం విజయవాడ నగరపాలక సంస్థ ఎదుట ఉన్న గాంధీ కాంస్య విగ్రహం వద్ద గురువారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్లు పి.కోటిరెడ్డి, ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింస ఆయుధాలుగా మార్చి మహాత్మా గాంధీ భారతదేశానికి స్వాతంత్ర్యాన్న తీసుకొచ్చారన్నారు. హింస వల్ల ఏర్పడిన సమస్య పరిష్కారం కాక మరింత జటిలంగా మారుతుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ.. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మా గాంధీ ఒకరన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిపాటి కిషోర్, శేగు వెంకటేశ్వర్లు, కొల్లిపర సురేష్, సాధు సత్యనారాయణ, కోట సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సర్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజల్లో సర్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందినప్పుడే సమాజంలో అహింస మార్గం ఏర్పడి గాంధీజీ కన్న కలలు నిజమవుతాయని సామాజిక ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పటమట అంబేడ్కర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గాంధిజీ, కస్తూరిబా విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హజరత్తయ్య గుప్తా, సమాజంలో ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు పెంచి అందరినీ సమభావంతో చూస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి చింతా వెంకటేశ్వర్లు సారథ్యం వహించగా డాక్టర్ లక్ష్మీస్నేహ, జయలక్ష్మి, న్యాయవాది పైడా భాను, మాజీ మున సబు నల్లూరి వెంకట సుబ్బారావు, రజిత, టెంపుల్ ప్రసాద్, పి.నాగేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ, కస్తూరిబా విగ్రహాల వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న హజరత్తయ్య గుప్తా



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ అసోసియేషన్ సభ్యులు

పీటీడీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో భవానీపురం హౌసింగ్ బోర్డ్‌కాలనీలో గాంధీజీ వర్ధంతి జరిగింది. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ అహింస ద్వారా ఏదైనా సాధించవచ్చన్న దృఢ సంకల్పంతో బ్రిటిష్ పాలకులపై పోరాడి భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ ఘనత అజరామరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భవానీపురం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదాల తిరుపతిరావు యాదవ్, పిచ్చుక లింగారావు, టి.పూర్ణయ్య, బి.రవి, ఎం.మోజస్, అమృత, టి.ప్రమీల, మహ్మద్ ఖాన్, సురేష్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



గాంధీకి నివాళులర్పిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్

పటమట(విజయవాడతూర్పు): బ్రిటీష్ పాలన నుంచి దేశానికి అహింసతో స్వాతంత్ర్యం సాధించిన మహాత్మ గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సత్యం, అహింస తమ ఆయుధాలుగా భారతదేశ స్వాతంత్రానికి తోడ్పడిన మహనీయుని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. స్వచ్ఛత భారత్ అంటూ సంకల్పించిన మహాత్ముని మార్గదర్శకాలలో మనం నడవాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, ఎకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ మాయమైన కేసులో అధికారులపై చర్యలకు ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ గౌడౌన్‌లోని స్టీల్ మాయమైన ఘటనలో అధికారులపై చర్యలకు ఆ సంస్థ ఎండీ రాజాబాబు ఆదేశించారు. ఈ మేరకు సంస్థ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రూ. 1.95 కోట్ల విలువైన 271 మెట్రిక్ టన్నుల స్టీల్ మాయమైనట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. దీనిపై ఒక అసిస్టెంట్ ఇంజినీరు సస్పెన్షన్, ఇద్దరు ఉద్యోగులపై క్రిమినల్ చర్యలకు ఆదేశించామని తెలిపారు. ఇద్దరు పీడీలు, ఇద్దరు ఈఈలు, నలుగురు డీఈఈలకు షోకాజు నోటీసులు, నలుగురు రిటైర్డ్ అధికారులకు బెనిఫెట్స్ నిలిపివేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎండీ రాజాబాబు పేర్కొన్నారు.

బీసీలను నిలువునా ముంచిన చంద్రబాబు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బీసీలను చంద్రబాబునాయుడు నిలువునా ముంచివేశారని హైకోర్టు అడ్వకేట్, ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్‌లో చెప్పిన బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. బీసీలకు చట్టబద్ధంగా రాష్ట్రంలో కుల గణన వెంటనే చేపట్టాలన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు, మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తానని.. కరెంటు చార్జీలను తగ్గిస్తానని చెప్పి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ నాడు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని హేళన చేసిన చంద్రబాబు, నేడు సూపర్ సిక్సులు అమలు చేయడానికి ఖజానాలో డబ్బులు లేవని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు.

రైల్వే హాస్పిటల్ సీఎంఎస్‌గా డాక్టర్ శ్రీనివాసులు



శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ (చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్)గా డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హాస్పిటల్ సిబ్బంది, వైద్యులు, సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సీఎంఎస్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ శౌరిబాల గుంటూరుకు బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీనివాసులు హాస్పిటల్‌లోని పలు విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

జీజీహెచ్‌లో ప్రివెంటివ్, వెల్నెస్ క్లినిక్



వెల్నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ వేంకటేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన ప్రివెంటివ్, వెల్నెస్ క్లినిక్‌ను గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వేంకటేశ్వరరావుతో కలిసి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాధాన్యత పొందిన జీవనశైలి వ్యాధులను ముందుగా నిర్ధారణచేసేందుకు, ప్రజలకు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తెలియజేసేందుకు ఈ క్లినిక్ దోహదం చేస్తుందన్నారు. ఈ క్లినిక్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని వైద్యులకు సూచించారు. ప్రతి సోమ, బుధవారాల్లో ఈ క్లినిక్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ ఏఆర్‌సీహెచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తుది మెరుగులు దిద్దుకుంటున్న యాగశాల



యాగశాల చుట్టూ నిర్మిస్తున్న షెడ్లు



షెడ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నూతన యాగశాల తుది మెరుగులు దిద్దుకుంటోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు రూ.5 కోట్లతో దాత సంగా నరసింహారావు యాగశాలను నిర్మాణం చేపట్టారు. ఈ యాగశాల ప్రారంభోత్సవం సైతం జరిగింది. విశేష పర్వదినాల్లో చండీహోమానికి అత్యధిక సంఖ్యలో ఉభయదాతలు తరలివస్తుండటం, ప్రస్తుత అవసరాలకు యాగశాల సద్వినియోగం అవుతోంది. భవిష్యత్తులో ఉభయదాతల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో యాగశాల చుట్టూ ఉన్న ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు యాగశాల చుట్టూ ఆరు అడుగుల మేర ఉన్న మట్టి, కొండ రాళ్లను తొలగించి అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతంలో షెడ్ల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే షెడ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రిని భారీ క్రేన్ సాయంతో యాగశాల పరిసరాలకు తరలించారు. ఈ పనులు పూర్తయిన పిమ్మట మాఘమాసం నుంచి నూతన యాగశాలలో హోమాలు నిర్వహించేందుకు వైదిక కమిటీ కృషి చేస్తోందని సమాచారం.

వాసవీ అమ్మవారికి వైభవంగా తిరుప్పావై సేవ



అమ్మవారికి సారే సమర్పణ



తిరుప్పావై సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ వాసవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవీ అమ్మవారికి గురువారం తిరుప్పావై సేవ, సారే సమర్పణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శ్రీవాసవీ ఫౌండేషన్ ఇతర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పర్వదిన మహోత్సవాలను స్థానిక పాతబస్తీలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం అమ్మవారికి తిరుప్పావై సేవ జరిగింది. అమ్మవారి మూర్తి ఎదుట పులిహోర, గారెలను పెట్టి అమ్మవారి రూపాన్ని ఏర్పాటు చేసి నివేదన చేశారు. సాయంత్రం శ్రీ వాసవీ అమ్మవారి ఆలయం నుంచి మహిళలు ఊరేగింపుగా బయలుదేరి సారేను తీసుకొని ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకున్నారు. అక్కడ అమ్మలవారికి సారేను సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వి.వి.కె.నరసింహారావు, నాయకులు నూకల నాగేశ్వరరావు, నంబూరు ప్రదీప్, నున్న కృష్ణ, సింహాద్రి వేణుగోపాల్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ సమయంలో అమరులైన వైద్యులకు నివాళి



కోవిడ్ అమర వైద్యులకు నివాళులర్పిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్ బారిన పడిన వారికి వైద్య సేవలు అందిస్తూ, ఆ మహమ్మారి బారిన పడి అమరులైన వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నివాళులర్పించింది. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి రోజున అమరులైన జవాన్ల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటారని, అదే రీతిలో ఐఎంఏ అమరులైన వైద్యుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ మాట్లాడుతూ.. కోవిడ్ బారిన పడి దేశ వ్యాప్తంగా రెండు వేల మంది వైద్యులు అమరులయ్యారని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.అగర్వాల్, పూర్వ జాతీయ ఉపాధ్యక్షుడు పొట్లూరి గంగాధరరావు వంటి వారు ఎందరో ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. వారిని కోవిడ్ అమర వైద్యులుగా గుర్తించడం సముచితంగా భావిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా క్యాండిల్స్ వెలిగించి వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్రబోస్, నగర అధ్యక్షుడు డాక్టర్ బోడేపూడి హనుమయ్య, డాక్టర్ ఎంఎ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్

గుణదల(విజయవాడ తూర్పు): అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ నేతలు ఇచ్చిన హామీలు నెరవేరే పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు చందా కిరణ్ తేజ పేర్కొన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ఆచరణకు వీలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేస్తామని నమ్మబలికి ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో పేదలను మభ్య పెట్టారని విమర్శించారు. టీడీపీ చేసిన మోసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గా ప్రసాద్, హరీష్ పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి

గుణదలలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో గురువారం మహాత్మగాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పార్టీ నగర నాయకులు మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నేతలు పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.